మన సమగ్ర ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

బుధవారం , 16, సెప్టెంబర్, 2026

తెలుగు డైలీ

ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...

5 PM

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

https://epaper.prajavaani.net


## కోటి ఎకరాలు కాదు కేవలం 3.60 లక్షల ఎకరాలే

# నిషేధిత జాబితాలో ఉన్నాయి

- ●22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ అసత్యాలు మాట్లాడుతోందన్న ఆది శ్రీనివాస్
- ●బీఆర్ఎస్ పాలనలోని తప్పిదాలను సరిదిద్దుతుంటే ఓర్వలేకపోతున్నారని మండిపాటు
- ●మాక్ అసెంబ్లీ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని విమర్శ



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా కొందరు నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి పాలకులు చేసిన చారిత్రక తప్పిదాలను ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సరిదిద్దుతుంటే ఓర్వలేక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాస్తవానికి హైకోర్టు ఆదేశాలు, తీవ్రమైన న్యాయపరమైన వివాదాలు ఉన్న కేవలం 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచినట్లు స్పష్టం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దుతోందని తెలిపారు.అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభకు హాజరుకాకుండా 'మాక్ అసెంబ్లీ'ల పేరుతో నాటకాలు ఆడటం బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సభాపతిని, దళిత వర్గాలను, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అవమానిస్తూ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ధరణి అడ్డం పెట్టుకుని జరిగిన భూ దారుణాలను త్వరలోనే ఆధారాలతో సహా అసెంబ్లీ వేదికగా బట్టబయలు చేస్తామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

## తెలంగాణలో మరో కొత్త పథకం.. ఒక్కొక్కరికి నేరుగా

# రూ.1 లక్ష సాయం





**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** తెలంగాణలోని నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ తీపికబురు అందించింది. స్వయం ఉపాధి పొందాలనుకునే యువతకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనుంది. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలోనే ఈ పథకానికి అర్హులైన యువతీయువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో అర్హులను కూడా ఎంపిక చేసి తుది జాబితా రూపొందించారు. అయితే ఇప్పుడు వారికి రూ.లక్ష ఆర్థిక సాయం విడుదల చేసేందుకు రేవంత్ ప్రభుత్వం ముహూర్తం ఫిక్స్ చేసింది. నవంబర్ 19వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేయనుండగా.. ఆ రోజు నుంచి అర్హులకు రూ.లక్ష సాయం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఏర్పాట్లు ఇప్పటినుంచే చేయాలని ఆదేశించారు.నిరుద్యోగ యువత సొంతగా ఉపాధి పొందేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అర్హతలు, దరఖాస్తులు, ఎంపికకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడించనుంది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ద్వారా యువత తమకు నచ్చిన రంగాల్లో ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చు. ప్రజాభావన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు.

## తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# రెండో రోజు పర్యటన





**తిరుమల:** తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. తొలుత వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్? ప్రారంభించారు. ఈవీ బస్సులు ప్రారంభించనున్న సీఎం: అనంతరం తిరుమలలో సీఎం చంద్రబాబు ఉచిత ధర్మరథం బస్సులను ప్రారంభించారు. రిలయన్స్, భారత్ బయోటెక్ సంస్థలు ఈవీ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా అందించాయి. ఈ ఈవీ బస్సులను నారాయణగిరి ఉద్యానవనాల వద్ద సీఎం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. నారాయణగిరి ఉద్యానవనాల నుంచి ఎస్వీ మ్యూజియం వరకు బస్సులో ఆయన ప్రయాణం సాగింది. ఆ తర్వాత టీటీడీ ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని చంద్రబాబు ప్రారంభించారు. మ్యూజియంలో జీం3 అంతస్తులు, 19 గ్యాలరీలు, 14 వేల కళాఖండాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబుతో పాటు ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. తిరుమల విశిష్టతను భక్తులు తిలకించేలా శ్రీవారి నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు త్రీడీ వీడియో ప్రదర్శన కోసం సెంటర్? ఏర్పాటు చేశారు. మంత్రులు ఆనం, అనగానితో కలిసి సీఎం ఎక్స్‌పీరియన్స్ కేంద్రాన్ని దర్శించారు. వర్చువల్ రియాలిటీలోనూ తిరుమల దర్శన్‌ను సీఎం చంద్రబాబు తిలకించారు.

# ఇంధన పొదుపుతో దేశానికి మరింత భద్రత



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** ఇంధన సామర్థ్యమే మరో విద్యుత్ కేంద్రమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.? విద్యుత్ ఉత్పత్తితో పాటు విద్యుత్ పొదుపుపైనా దృష్టి సారించాలని తెలిపారు. (బుధవారం) ఉదయం హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో జరిగిన - ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ నిర్వహించే 25వ 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్-2026' కార్యక్రమానికి భట్టి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్పత్తి చేసే విద్యుత్ కంటే అవసరం లేకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే చౌకైనదని చెప్పుకొచ్చారు. ఇంధన సామర్థ్యాన్ని కేవలం పర్యావరణ బాధ్యతగా చూడొద్దని.. ఇంధన సామర్థ్యం ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహమని తెలిపారు.మెరుగైన మోటార్లు, శీతలీకరణ వ్యవస్థలతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని డిప్యూటీ సీఎం సూచించారు. స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌తో విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. ప్రతి మెగావాట్ విద్యుత్ డిమాండ్ తగ్గితే విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. పరిశ్రమలు, తయారీ, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు మరింత విద్యుత్ అవసరమని వెల్లడించారు. తక్కువ పీక్ డిమాండ్‌తో విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్‌పై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. ఇంధన పొదుపుతో దేశానికి మరింత ఇంధన భద్రత ఏర్పడుతుందని చెప్పారు.భారత్‌లో మంచి పైలట్ ప్రాజెక్టులకు కొరత లేదని భట్టి స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుదీకరణ, డిజిటలైజేషన్‌తో ఇంధన సామర్థ్యాన్ని పెంచాలని అన్నారు.ాాxతో విద్యుత్ వృథాను గుర్తించి వినియోగాన్ని మరింత సమర్థవంతం చేయాలన్నారు. భవిష్యత్తులో కర్మాగారాలు కేవలం విద్యుత్ వినియోగదారులుగా కాకుండా విద్యుత్ వ్యవస్థలో చురుకైన భాగస్వాములు కావాలని సూచించారు. ఇంధన సామర్థ్యాన్ని ఏడాదికి ఒకసారి చేసే ఆడిట్‌గా కాకుండా నిరంతర నిర్వహణ ప్రక్రియగా మార్చాలన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, టెక్నాలజీ సంస్థలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థలు కలిసి పనిచేయాలని చెప్పారు. స్థిరమైన అభివృద్ధికి ఇంధన సామర్థ్యమే అత్యంత ఆచరణాత్మక మార్గమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఆ ఇద్దరూ కలిసి మరోసారి కాంగ్రెస్‌ను

# అధికారంలోకి తీసుకొస్తారు



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మధ్య మంచి సమన్వయం ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. (బుధవారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఈ ఇద్దరూ కలిసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉండాలని తాము అనుకున్నామని.. అయితే సభలో ఉండొద్దనే ఎత్తుగడతోనే బీఆర్ఎస్ సస్పెన్షన్‌కు గురైందని విమర్శించారు. అసెంబ్లీ అంటే బీఆర్ఎస్ పార్టీకి నచ్చదంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కువ రోజులు సభను నడపలేదన్నారు. ఇప్పుడు తాము సభ నడిపితే ఉండడం లేదంటూ బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం

# టెండర్లు పిలిచాం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు (బుధవారం) ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయాల గురించి సభలో చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారు. చాలా చోట్ల తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ప్రస్తావించారు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.640 కోట్లతో కొత్త ఎమ్మార్వో భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించడం కోసం టెండర్లు పిలిచామని చెప్పుకొచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో నిర్మాణంలోని కార్యాలయాన్ని త్వరగా నిర్మించి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరికి

# డీఆర్‌డీవోలో కీలక పదవి



**హైదరాబాద్:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రయోగశాల 'రీసెర్చ్ సెంటర్ ఇమారత్' (ఆర్‌సీఐ) నూతన డైరెక్టర్‌గా ప్రము ఖ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్రీహరి బాధ్యతలు స్వీకరించారు. హైద రాబాద్‌లోని ఈ ప్రఖ్యాత సంస్థలో ఆయన బాధ్యతలు చేపట్టారు. క్షిపణి వ్యవస్థలు, ఏవియానిక్స్ రంగాల్లో ఆర్‌సీఐ దేశంలోనే అత్యంత కీలకమైన పరిశోధనా కేంద్రంగా గుర్తింపు పొందింది. 1992లో డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన డాక్టర్ శ్రీహరి, మూడు దశాబ్దాలకు పైగా సంస్థలో వివిధ ఉన్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత నియామకానికి ముందు ఆయన భారత బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ) కార్యక్రమానికి ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. దేశ క్షిపణి రక్షణ వ్యవస్థలో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణుల కోసం 'డైవర్ట్ అండ్ ఆటిట్యూడ్ కంట్రోల్ సిస్టమ్' అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2019లో భారత్ అంతరిక్షంలోని ఉపగ్రహాన్ని విజయవంతంగా కూల్చివేసి చరిత్ర సృష్టించిన 'మిషన్ శక్తి' (యాంటీ శాటిలైట్ టెస్ట్) కోర్ టీమ్‌లో శ్రీహరి కీలక సభ్యుడిగా ఉన్నారు. అలాగే, భారత వాయుసేన కోసం ఇజ్రాయెల్‌తో కలిసి సంయుక్తంగా ఆయన సేవలందించారు.

# ఆపదలో పేదలకు అండగా సీఎం సహాయనిధి

**10 మంది లబ్ధిదారులకు రూ.3.47 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**





**మేడ్చల్:** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. అత్యవసర వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని పలువురు పేదలు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.3,47,000 ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మొత్తం 10 మంది లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఖరీదైన వైద్యం భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.లబ్ధిదారుల వివరాలుమేడ్చల్‌కు ెందిన సత్యమ్మకు రూ.60,000, శామీర్‌పేట్‌కు చెందిన రాగిరి బాబుకు రూ.11 ,500, మేడిపల్లికి చెందిన మధుకు రూ.10,500, శామీర్‌పేట్‌కు చెందిన మేడి జోయెల్‌కు రూ.7,000, వరలక్ష్మికి రూ.19,500, కీసరకు చెందిన శ్రీకాంత్‌కు రూ.19,500, వెంకటేష్‌కు రూ.39,000, కీసరకు చెందిన రాజుశా శ్రీకి రూ.60,000, వినోద్ కుమార్‌కు రూ.60,000, లాల్‌గడి మలక్‌పేట్‌కు చెందిన ఆకుల లిఖితకు రూ.60,000 చొప్పున సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం మంజూరైంది.మొత్తంగా పది మంది లబ్ధిదారులకు రూ.3,47,000 విలువైన చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు వైద్య చికిత్స సమయంలో ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.పేద ప్రజలకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అత్యవసర వైద్య అవసరాలతో బాధపడుతున్న అర్హులైన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రోడ్డు నిర్మాణంలో తేడాలెందుకు?

**అధికారులను ప్రశ్నించిన జన్ను కిషన్.. వెంటనే రంగంలోకి ఈఈ రాజ్‌కుమార్**

**కొన్ని చోట్ల వెడల్పు.. మరికొన్ని చోట్ల ఇరుకు -- క్షేత్రస్థాయిలో పరిశీలన**





**హాసన్‌పర్తి: రిపోటర్ ప్రణయ్ గొర్రె:16** సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి సెయింట్ మేరీస్ పాఠశాల వరకు నిర్మిస్తున్న నూతన రహదారి పనుల్లో కొన్ని చోట్ల వెడల్పుగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వాహనదారులు, పాదచారులకు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ విషయంపై జన్ను కిషన్ సంబంధిత అధికారులను ప్రశ్నించి, రహదారిని సరిసమానంగా వెడల్పుతో నిర్మించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సమస్యపై ఫోన్ చేయగానే స్పందించిన జీడబ్ల్యూఎంసీ ఈఈ రాజ్‌కుమార్ వెంటనే క్షేత్రస్థాయికి చేరుకుని రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్డు వెడల్పు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలిస్తూ అవసరమైన చర్యలపై దృష్టి సారించారు.రహదారి నిర్మాణం పూర్తయ్యేలోపు సమస్యను పరిష్కరించి, సరిసమాన వెడల్పుతో సురక్షితమైన రాకపోకలకు అనువుగా రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

# మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు

**రెండో రోజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు బెలిదే రమేష్ గుప్త**





**మేడ్చల్, సెప్టెంబర్ 16:** కీసరలో మహారాజ్ యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్ గుప్త పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ కీసర గ్రామ శాఖ అధ్యక్షులు చినింగని బాలరాజు, గోరింటి ప్రవీణ్, మహేష్, తిరుమల్, తుడుం బాలకృష్ణ, ఉదయ్, రాజు రెబెల్, అఖిల్, యశ్వంత్, తుడుం సాయి తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులు పెద్ద సంఖ్యలో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో కాలనీలో ఆధ్యాత్మిక, భక్తి వాతావరణం నెలకొంది. నవరాత్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు మహారాజ్ యువసేన యూత్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి



**మేడ్చల్ సెప్టెంబర్ 16 (ప్రజా వాణి):-** తెలంగాణ విమోచన దినోత్సవంగా సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మేడ్చల్ జిల్లా నాయకులు కిస్టాపూర్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిస్టాపూర్‌లో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ భారీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్దార్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు.ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ డివిజన్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు నిజాం పాలన నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఆ రోజును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సెప్టెంబర్ 17 సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని, స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల సేవలను స్మరించుకోవాలని వారు కోరారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో దేశ సమైక్యత కోసం జరిగిన కృషిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కార్యక్రమంలో గౌరరం జగన్ గౌడ్ బిజేపీ మేడ్చల్ జిల్లా నాయకులు, అర్జున్, గౌలికర్ మహేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సర్దార్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు.

# బైరాన్‌పల్లి” అమరుల త్యాగాలను వృథా కానివ్వం

- **17 సెప్టెంబర్‌ను అధికారికంగా నిర్వహించాలి..**
- **బైరాన్‌పల్లి,గుండ్రాంపల్లి పోరాట ఖిల్లాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి**
- **సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్**



**మద్దూరు సెప్టెంబర్ 16, ప్రజా వాణి,**

భారతదేశానికి పోరాటాలతో ఓనమాలు నేర్పింది కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం 78వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బైరాన్‌పల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల స్థూపం, చారిత్రక బురుజు వద్ద పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం బురుజు వద్ద స్థానిక మండల కన్వీనర్ వలబోజు నర్సింహా చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన, ధన, మాన, ప్రాణ దోపిడీలకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లి ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. 118 మంది అమరులైన బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లి వంటి పోరాట ఖిల్లాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి స్మృతి చిహ్నాలుగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. నాటి పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాలని కోరారు.ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభాపక్ష నేత చాడ వెంకటరెడ్డి గతంలో పలుమార్లు ప్రభుత్వాలకు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు.1946 జూలై 4న తొలి అమరుడు దొడ్డి కొమురయ్య నుంచి వేలాది మంది యోధులు నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగించిన పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని నాయకులు తెలిపారు. లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, అనేక గ్రామాలను నిజాం పాలన నుంచి విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టు ఉద్యమానిదేనన్నారు. 17 సెప్టెంబర్‌ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ విమోచన చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. ప్రజలతో కలిసి కమ్యూనిస్టులు సాగించిన పోరాటాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, బెక్కంటి సంపత్, నంగి కనకయ్య, బైరాన్ పల్లి శాఖ కార్యదర్శి ఆరుగొండ మల్లేష్,గూడెపు సుదర్శన్, దండబోయిన వెంకటేష్, గోమరపు నర్సయ్య, బంగారు ప్రేమ్ కుమార్, శిగుళ్ల నరేష్, నంగి సత్తయ్య, కాశబోయిన చరణ్, మహిళా, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు.

- **ఎంపీ గారు, ఎమ్మెల్యే గారి సహకారంతో బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ చెక్కు మంజూరు.**
- **పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ అండగా సీఎం రిలీఫ్ ఫండ్.**
- **అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం.**
- **ప్రజల కష్టకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోంది..**
- **ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబాటు.**
- **జూలకంటి సీతారాం రెడ్డి (కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డైరెక్టర్ )**



**ప్రజావాణి సెప్టెంబర్ 16** బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన కేస పెద్ద లింగయ్య గారు గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న సిరిగద్దె రమేష్ గారికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ గారి సహకారంతో ఇల్లందు శాసనసభ్యులు గౌరవ శ్రీ కోరం కనకయ్య గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి లబ్ధిదారుడుకు 20000/- రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించడం జరిగింది.. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని, ప్రజల కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు లింగయ్య గారికి సహకరించిన ఎంపీ బలరాం నాయక్ గారికి, ఎమ్మెల్యే కోరం కనకయ్య గారికి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కళింగ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులుఒ దళిత రత్న పుల్లూరి బాలరాజు తదితర పాల్గొన్నారు..

# ఇందిరమ్మ ఇళ్లపై అర్హుల ఎదురుచూపులు

**ఆంగోత్ తండాలో ఆరుగురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్**










**మంచాల, (ప్రజావాణి ):** సెప్టెంబర్ 16: ఆంగోత్ తండ గ్రామపంచాయతీలో గుడిసెల్లో. నివసిస్తున్న అర్హులైన ఆరుగురు నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ఆరుగురు అర్హులుగా గుర్తించినట్లు జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి డా. బాలకోటి నాయక్ తెలిపారు.గతంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై నిర్వహించిన లబ్ధిదారుల ముఖాముఖి కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ, అర్హులైన వారందరికీ ఇళ్లు కేటాయించలేదని బాలకోటి నాయక్ ఆరోపించారు. సర్వేలో అర్హులుగా గుర్తించిన ఆరుగురిలో కేవలం ఇద్దరికే ఇళు మంజూరు చేస్తామని చెప్పడం వల్ల మిగిలిన అర్హుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు.ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గుడిసెల్లో నివసిస్తున్న నిజమైన అర్హులకు ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆరుగురు అర్హులకూ ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని డా. బాలకోటి నాయక్ తెలిపారు.


Printed, Published and Owned by **RAYINIPATLA KUMARASWAMY**, Printed at **RAMANI WEB OFFSET PRINTERS**, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : **RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS**, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. **RNI NO:TGTEL/25/A5443** Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com